క్లుప్తంగా

15న పెన్షనర్ల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 న కలెక్టరేట్ ఎదుట ఉదయం 11 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వాలిడేషన్ అమెండ్‌మెంట్‌ను, పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాలను నిలిపివేయాలన్నారు. 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించండి



వెంగంపల్లెలో రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చునని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు అన్నారు. బుధవారం మండలంలోని వెంగంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులకు, బాలింతలకు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది



పాపసముద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ, రైతులు

గుడిపాల: రైతులు పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించి చీడ పురుగుల నుంచి రక్షించుకోవాలని ఏఓ సంగీత కోరారు. గుడిపాల, పాపసముద్రం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో రైతులకు సమావేశం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటలను తెగుళ్లు ఆశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సిబ్బంది యోగప్రియ, తులసిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పూజారి రాఘవేంద్ర అన్నారు. బుధవారం నగరంలో ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కట్టమంచి వద్ద ఉన్న వివేకానంద విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుపోవాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు బాగ్ కన్వీనర్ పవన్, మోక్షిత్, ప్రశాంత్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలి



గర్భవతులకు పండ్లు, బిస్కెట్లు, జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భవతులకు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పిఎంఎస్ఎంఎ) కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. హైరిస్క్ గర్భవతులను పరీక్షించి చికిత్స చేశారు. గర్భవతులు సకాలంలో భోజనం చేయాలని, తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భవతులకు అరగొండ అపోలో హాస్పిటల్ యాజమాన్యం అరటి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఆపిల్ జ్యూస్ ప్యాకెట్లను అందజేసింది. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్లు రాజామణి, రెడ్డెమ్మ, నిర్మలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

పుంగనూరు (చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని సెంటర్ లాడ్జిలో వున్న కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు బుధవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. దీంతో కార్మికులు, ఉద్యోగులు తమ హక్కులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అదిరేది లేదు.. బెదిరేదీ లేదు..

జగనన్నను చూసొద్దాం

- పోలీసుల ఆంక్షలను లెక్కచేయని జనం
- నోటీసులు ఇచ్చినా భయపడని వైనం
- జనసంద్రంగా మారిన బంగారుపాళ్యం



మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న జగన్‌మోహన్ రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్



అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (ఇన్‌సెట్) పార్టీ జెండాతో మహిళ ఆనందం

పలమనేరు: మామిడి రైతులకు అండగా నిలచి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం బంగారుపాళ్యం వచ్చారు. ఆయన పర్యటనను విజయవంతం కాకుండా చేయాలని కూటమి ప్రభుత్వం చేసిన కుట్రలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు, రైతులు భగ్నం చేశారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా, కేసులు పెడతామని నోటీసులు ఇచ్చినా లెక్కచేయకుండా బంగారుపాళ్యం మామిడి కాయల మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మార్కెట్ యార్డు ఎటు చూసినా జనంతో కిక్కిరిసింది.

బెడిసికొట్టిన ప్లాన్లు

రైతులు, ప్రజలు రాకుండా గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు ఆంక్షలు విధించారు. వేలాది మంది పోలీసులతో ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. బస్సులను ఆపి చెక్ చేశారు. బైక్‌లను అడ్డుకున్నారు. ప్రయాణికులతో వెళుతున్న బస్సులను సైతం సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనికితోడు బంగారుపాళెం మార్కెట్‌లో రైతులు లేకుండా రాత్రికి రాత్రే అందరినీ పంపించేశారు. కనీసం మండీల యజమానులు సైతం కనిపించకుండా చేశారు. మామిడి రైతులు నేరుగా వచ్చి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ కష్టాలు చెప్పుకున్నారు.

ముందస్తు నోటీసులు, బైండోవర్లు

బంగారుపాళెం పర్యటనకు వైఎస్సార్ సీపీ నేతలు రాకుండా మండలాల పోలీసులు మంగళవారమే నోటీసులు ఇచ్చారు. బుధవారం సైతం కొందరు నాయకులను బైండోవర్ చేసి స్టేషన్లలో పెట్టారు. అయినా బెదరకుండా కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేశారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా జనసందోహం రావడం చూసి కూటమి నేతల గుండెల్లో గుబులు పట్టుకుంది.



రావడానికి వీల్లేదు: బంగారుపాళ్యం మార్కెట్ గేట్లు మూసేయడంతో బయటే వున్న రైతులు, ప్రజలు



జగనన్నను చూడాలని..



అదిగదిగో జగనన్న వస్తున్నాడు..



ధరలేక మామిడి కాయలను రోడ్డుపై పోసి నిరసన



జగనన్నకు బాధలు చెప్పుకోవాలని మహిళల పరుగులు



జగన్ వస్తున్నారని : బంగారుపాళ్యం మార్కెట్‌లో వ్యాపారులు, రైతులను ఖాళీ చేయించిన పోలీసులు







ఇటు ఎవరినీ వెళ్లనీయం: ప్రజలు, రైతులు జగన్ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



పోలీసులు నిలిపేసిన బస్సులు

అడుగడుగునా అవరోధాలు

- గ్రామాల్లోనే రైతులు, కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- జగన్ పర్యటనకు ద్విచక్ర వాహనాల్లో వెళ్లిన రైతన్నలు



జగన్ పర్యటనకు వెళ్లకుండా బండపల్లె గ్రామస్తులను గ్రామంలోనే అడ్డుకున్న పోలీసులు



189కొత్తపల్లెలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వెళ్లకుండా గ్రామస్తులను అడ్డుకున్న పోలీసులు

గుడిపాల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మామిడి రైతులను కలిసేందుకు బంగారుపాళెం మార్కెట్ యార్డుకు వస్తున్నారని మండలం నుంచి బయల్దేరిన రైతులు, కార్యకర్తలకు పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. 27 పంచాయతీలకు సంబంధించి రైతులు బస్సుల్లో వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆయా గ్రామాలకు వెళ్లి పోలీసులు బస్సు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎవరూ జగన్ పర్యటనకు వెళ్లకూడదంటూ ఆంక్షలు విధించారు. ఆయా గ్రామాల్లోనే అందరినీ కట్టడి చేశారు. అయినప్పటికీ కొంతమంది ఇవన్నీ లెక్కచేయక తెగించి ద్విచక్ర వాహనాల్లో వెళ్లారు. మండలంలోని కొంతమంది నాయకులను చిత్తూరులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



ఐలవారిపల్లెలో 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులతో పాటు ఆదాయం పొందవచ్చునని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని ఐలవారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, రైతులు రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించి పంటలు పండించాలని చెప్పారు. అవసరం మేరకు కషాయాలు వాడాలన్నారు. అన్ని పంటలకు ఘన, జీవామృతం తయారు చేసుకోవాలన్నారు. భూమిలో ఘన జీవామృతం వేయడం వల్ల భూమిలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీఏఏలు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన



క్రిష్ణజమ్మాపురంలో కేంద్ర బృందం

గుడిపాల: మండలంలోని క్రిష్ణజమ్మాపురంలో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, తడిచెత్త–పొడిచెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును కేంద్ర బృందం సభ్యులు దామోదరం, రాజేష్ పర్యటించారు. కంపోస్ట్ తయారీ, మరుగుదొడ్ల వినియోగం గురించి కుటుంబాలతో ఆరా తీశారు. అంగన్‌వాడీ, పీహెచ్‌సీ, పాఠశాలల్లో మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లలో పారిశుద్ధ్య నిర్వహణ గురించి సర్వే చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంపూర్ణ, ఎస్‌డబ్ల్యూఎం కన్సల్టెంట్ బాలసుందరం, ఎస్‌బీఎం ఎంఆర్‌సీ రాజ్‌కుమార్, కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సద్వినియోగం

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో కొంగారెడ్డిపల్లెలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించే స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల చైర్మన్ ప్రసాద్ రాజు, ప్రిన్సిపల్ ఆనంద్‌కుమార్ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ వరకు కళాశాలలో అజెంటిక్ ఏఐపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బీసీఏ (ఏఐ), బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం సీఏ ఇతర గ్రూపుల విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

శేష వాహనంపై శ్రీరామచంద్రుడి విహారం



శేషవాహనంపై విహరిస్తున్న శ్రీరామచంద్రుడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శేష వాహనంపై శ్రీరామచంద్రుడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులు స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, సుగంధ పరిమళ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. పండితులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేయించి నైవేద్యం సమర్పించారు . రాత్రి విద్యుద్దీపాలంకరణ, గజమాలలు, పుష్పాలతో అలంకరించిన శేషవాహనంపై శ్రీరామచంద్రుడు విహరించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

పోటీతత్వంతో ముందుకు..



బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు సాగాలని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఆ కళాశాలలో జనజాగృతి సంస్థ విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుల్లో రాణించడంతోపాటు ఇతర అంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ, దేశంలో జనగణన, కులగణనను ప్రారంభించేందుకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సామాజిక మార్పులకు కుల వివరాలు దిక్సూచిలా ఉపయుక్తమవుతాయన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుకుమరన్, నాయకులు రెడ్డిమస్తాన్, సునీల్‌కుమార్, హేమంత్ చౌదరి, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితా

గుడిపాల: మండలంలోని 17 రైతుసేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ జాబితాను ప్రదర్శిస్తున్నట్లు వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. ఇప్పటికి 4600 మంది రైతులను అర్హులుగా గుర్తించామని, ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను చూసుకోవాలన్నారు. ఒకవేళ పేర్లు లేనిపక్షంలో అర్హులుగా ఉన్న రైతులు 12వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

కదం తొక్కిన కార్మిక వర్గం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చిత్తూరు కార్పొరేషన్: కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్లు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ, స్కీం వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు కదం తొక్కారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మానవహారం ఏర్పాటు చేయడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, స్కీం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ మాట్లాడారు. పోలీసులు 30 యాక్ట్ పేరుతో పలు ఆంక్షలు విధించినా కార్మికులు వెనుకంజ వేయలేదన్నారు. దశాబ్దాల క్రితం పోరాటాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయాలని యత్నించడం శోచనీయమన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటివి మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో హరిస్తారని, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలిక ఉండవన్నారు. అనంతరం ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జయరాజ్, కార్మిక నాయకులు షకీల, గంగ, రాజశేఖర్‌బాబు, శ్రీధర్‌బాబు, రమాదేవి, విజయగౌరి, గోపి, మణి మాట్లాడారు. మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటే, రాష్ట్రంలోని కూటమి పార్టీలు మద్దతు పలకడం సరికాదన్నారు. శాంతిపురం, పలమనేరుతోపాటు పలు మండలాల్లో పోలీసులు కార్మికులను బెదిరించడం తగదని నిరసించారు. అంగన్‌వాడీ, ఆశా, సంఘమిత్ర, మిడ్ డే మీల్స్, హమాలీ, ఆటో వెల్డింగ్, ఎల్ఐసీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

చిత్తూరు కార్పొరేషన్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 8వ వేతన సంఘాన్ని పూర్తి స్థాయిలో ఏర్పాటు వెంటనే చేయాలన్నారు. కారుణ్య నియామకాలపై ఐదు శాతం సీలింగ్ ఎత్తివేయాలని, కంటింజెంట్, జీడీఎస్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ చేసి అటానమస్ బాడీ ఉద్యోగులకు ఇచ్చిన సౌకర్యాలను కల్పించాలన్నారు. ఐడీసీల ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. అశాస్త్రీయమైన టార్గెట్ల పేరుతో ఉద్యోగులపై వేధింపులు ఆపాలన్నారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగ సంఘాల నాయకులు భాస్కర్, రామమూర్తి చెట్టి, మహదేవన్, సర్దార్, ప్రసాద్, పెన్షనర్ అసోసియేషన్ నాయకులు సుధాకర్ నాయుడు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.